హరితహారానికి కసరత్తు

- 28 నర్సరీల్లో 1.20 లక్షల మొక్కల పెంపకం
- తొమ్మిదో విడత హరితహారానికి అధికారుల కసరత్తు
- ముందస్తు వర్షాలతో మొక్కలకు జీవం



ధరూరు గ్రామశివారులో నర్సరీలో మొక్కలు

ధరూరు: తొమ్మిదో విడత హరితహారం కార్యక్రమానికి నర్సరీల్లో మొక్కలు సిద్ధంగా ఉన్నాయి. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ధరూరు మండలంలో మొత్తం 28 నర్సరీల్లో రూ.1.20 లక్షల మొక్కలు పెంచుతున్నారు. హరిత లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు అధికారులు ఇప్పటి నుంచే కసరత్తు చేస్తున్నారు. నర్సరీలోని ప్రతి మొక్కను నాటే విధంగా ఈ సారి పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నారు. హరితహారంపై ఉన్నతాధికారులు నిరంతరం నర్సరీలపై ప్రత్యేక శ్రద్ధ కనపరుస్తున్నారు. ఎప్పటికప్పుడు అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన చేస్తూ మొక్కల పెంపకాన్ని పరిశీలిస్తున్నారు.

అధికారుల పరిశీలనలతో కదలిక..

గ్రామాల్లో నర్సరీల్లో పెంచుతున్న మొక్కల పెంపకాన్ని జిల్లా స్థాయి అధికారులు పర్యవేక్షిస్తున్నారు. సారవంతమైన మట్టిని బ్యాగుల్లో నింపాలని, అప్పుడే మొక్కలు బలంగా పెరిగేందుకు అవకాశం ఉంటుందని కలెక్టర్, మండల అధికారులు ఇప్పటికే నర్సరీ నిర్వాహకులకు అవగాహన కల్పించారు. రెండు మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో మొక్కల పంపెకానికి వాతావరణం అనువుగా మారింది.

నర్సరీల్లో మొక్కల కళకళ...

ఇటీవల కురిసిన వర్షాలతో నర్సరీల మొక్కలకు మరింత ఊతమిచ్చినట్లయ్యింది. కురుస్తున్న వర్షాలతో మొక్కలు కళకళలాడుతున్నాయి. పర్యావరణాన్ని కాపాడటంలో కీలక పాత్ర పోషించే చెట్లతో కలిగే ప్రయోజనాలను అధికారులు గ్రామీణ ప్రజలకు వివరిస్తున్నారు. ఇప్పటికే ఉపాధి కూలీల ద్వారా తీయించిన గుంతల్లో మొక్కలు నాటేందుకు అధికారులు సంసిద్ధమవుతున్నారు. ఈ నెల రెండో వారం నుంచి హరితహారం ప్రారంభం కానున్నట్లు తెలుస్తోంది. మండలంలోని 28 గ్రామాల్లో మొక్కలు నాటే కార్యక్రమానికి ప్రారంభమవుతోందని అధికారులు తెలిపారు.

లక్ష్యాన్ని అధిగమిస్తాం

హరిత లక్ష్యాన్ని అధిగమించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. నర్సరీల నిర్వాహకులతో ఎప్పటికప్పుడు సమావేశం కావడంతో పాటు క్షేత్ర స్థాయిలో టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లను పరిశీలనకు పంపుతున్నాం. మొక్కల పెంపకంపై రైతులకు, గ్రామీణ ప్రాంత వాసులకు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం. దీంతో చెట్ల వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు వివరిస్తున్నాం.

– సుజాత, ఏపీఓ, ధరూరు

పాఠశాలల పునఃప్రారంభం

ధరూరు: వేసవి సెలవుల అనంతరం సోమవారం పాఠశాలలు పునః ప్రారంభమయ్యాయి. దాదాపు నెలన్నర రోజులుగా తర్వాత బడులు తెరుచుకున్నాయి. మొదటి రోజు విద్యార్థులు తక్కువ సంఖ్యలో పాఠశాలలకు హాజరు కాగా.. పాఠశాలల వద్ద గుమ్మాలకు తోరణాలు కట్టి విద్యార్థులకు స్వాగతం పలికారు. అల్వలపాడు ఉన్నత పాఠశాల వద్ద మామిడి తోరణాలు, ముగ్గులు ఆకట్టుకున్నాయి. హెచ్ఎం సరిత ఆధ్వర్యంలో గుమ్మడి కాయ కొట్టారు. పాఠశాలలో విద్యార్థులు ఉత్సాహంగా గడిపారు.



అల్వలపాడు ఉన్నత పాఠశాలలో గుమ్మడి కాయ కొడుతున్న ఉపాధ్యాయుడు

సీఎం పర్యటనతో సామాన్య ప్రజల ఇబ్బందులు



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి

అయిజ: ముఖ్యమంత్రి కేసీఆర్ గద్వాల జిల్లా పర్యటనకు ప్రభుత్వ, ప్రైవేట్ వాహనాలను వాడుకొని ప్రజలను ఇబ్బందులకు గురిచేశారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి ఆరోపించారు. సోమవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ, ప్రైవేట్ బస్సులతోపాటు వివిధ వాహనాలను బీఆర్ఎస్ నాయకులు ఉపయోగించుకోవడంతో విద్యార్థులకు, సాధారణ ప్రజలు అనేక ఇబ్బందులకు గురయ్యారని అన్నారు. సామాన్య ప్రజలు గ్రామాలకు వెళ్లేందుకు బస్సులు లేక అవస్థలు పడ్డారన్నారు. బీఆర్ఎస్ నాయకులకే చెల్లుతుందని అన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు భీంసేన్‌రావ్, పట్టణ ప్రధాన కార్యదర్శి భగత్‌రెడ్డి, వీరేశ్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ అందక పరేషాన్

- నిత్యం షాపుల చుట్టూ లబ్ధిదారుల ప్రదక్షిణలు
- మూసి ఉంటున్న దుకాణాలు
- సమాధానం చెప్పలేని పరిస్థితుల్లో డీలర్లు



అమరచింతలో మూసి ఉన్న రేషన్ షాపు

అమరచింత: మండలంలోని ఆయా గ్రామాల ప్రజలకు సకాలంలో రేషన్ బియ్యం అందకపోవడంతో లబ్ధిదారులు నిత్యం చౌకధర దుకాణాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన దుస్థితి నెలకొంది. 12వ తేదీ వచ్చినా రేషన్ షాపులకు బియ్యం రాకపోవడంతో లబ్ధిదారులు ఎదురుచూస్తున్న పరిస్థితులు దాప రించాయి. ఏడు నెలలుగా ట్రాన్స్‌పోర్టు సమస్య అధికంగా వేధిస్తుండటంతో ప్రతి నెల రెండో తేదీన రావల్సిన బియ్యం ఇప్పటి వరకు రాకపోవడంతో డీలర్లు సైతం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. లబ్ధిదారులు నిత్యం దుకాణం వద్దకు వచ్చి తమను ప్రశ్నిస్తున్నారని, వారికి సమాధానం చెప్పలేక అవస్థతులు పడుతున్నామని వాపోతున్నారు.

అందుబాటులో లేని లారీలు

అమరచింత మండలానికి మదనాపురం స్టాక్ పాయింట్ నుంచి ప్రతి నెల రేషన్ బియ్యం సరఫరా అవుతుంది. ఈ మధ్య అదనపు బియ్యం కోటాను ప్రభుత్వం అందిస్తుండటంతో రేషన్ షాపులకు బియ్యం సరఫరా చేస్తున్న ట్రాన్స్‌పోర్టు కాంట్రాక్టర్ సమయానికి లారీలను అందుబాటులోకి ఉంచకపోవడంతో రవాణా భారంగా మారిందని డీలర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వీటితో పాటు మదనాపురం సమీపంలోని ఊకచెట్టు వాగుకు వరదలు వస్తే బియ్యం సరఫరా నిలిచి పోతుందని తెలిపారు. మండలంలోని 19 రేషన్ షాపులకు ఇప్పటి వరకు సగం కోటానే బియ్యాన్ని సరఫరా చేయడంతో మిగిలిన బియ్యం కోటా కోసం ఎదురుచూడాల్సి వస్తోంది. రెండు నెలల కిందటి వరకు సన్నబియ్యం అందించిన అధికారులు ప్రస్తుతం దొడ్డు బియ్యం అందిస్తున్నారని, వీటిని కూడా సమయానికి అందించలేక పోతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఆయా రేషన్ షాపులకు బియ్యం సరఫరా చేస్తున్న సదరు ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతోనే సరఫరాలో జాప్యం అవుతుందని ఆయా గ్రామాల డీలర్లు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సకాలంలో రేషన్ షాపుల ద్వారా బియ్యాన్ని లబ్ధిదారులకు అందించాలని ప్రజలు కోరుతున్నారు.

పన్నుల పేరుతో ప్రజలకు కుచ్చుటోపీ



మాట్లాడుతున్న మధుసూదన్‌రెడ్డి

కొత్తకోట: ఇంటి పన్నులను పెంచుతూ ప్రభుత్వం ప్రజలను దోచుకుంటూ కుచ్చుటోపీ పెడుతుందని కాంగ్రెస్ మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం ఇంటి పన్నులను పెంచడాన్ని నిరసిస్తూ సోమవారం కొత్తకోట చౌరస్తాలో పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శన నిర్వహించిన అనంతరం మున్సిపల్ కార్యాలయం ఎదుట బైఠాయించి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జీఎమ్మార్ మాట్లాడుతూ.. పెంచిన ఇంటి పన్నులను తక్షణమే తగ్గించాలని ఆయన డిమాండ్ చేశారు. అభివృద్ధి పేరుతో అడ్డగోలుగా పన్నులను పెంచడం ప్రజలకు భారంగా మారుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపాలిటీ అభివృద్ధిలో బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఎద్దేవా చేశారు. కొత్తకోట మున్సిపాలిటీని అభివృద్ధి చేస్తున్నామని ప్రకటనలు తప్ప, స్థానిక ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి మున్సిపాలిటీకి ఒరగబెట్టిందేమి లేదన్నారు. మున్సిపాలిటీకి 30 పడకల ఆస్పత్రి, డిగ్రీ కళాశాల, ఊర్దూ మీడియం డిగ్రీ కాలేజీలను మంజూరు చేయిస్తానని ఎమ్మెల్యే ఇచ్చిన హామీలు గాలి మాటలే అని ఆరోపించారు. మున్సిపాలిటీలో డ్రెయినేజీ నిర్మాణం చేయకుండా డివైడర్ నిర్మాణం చేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు గుర్తు చేశారు. కమీషన్లకు కక్కుర్తి పడటమే బీఆర్ఎస్ నాయకులు చెల్లిందన్నారు. కార్యక్రమంలో మేస్త్రీ శ్రీనివాసులు, ప్రశాంత్, బోయేజ్, చీర్ల నాగన్నసాగర్, బాలరాజు, కృష్ణారెడ్డి, వెంకటేష్, శ్రీనివాస్‌రెడ్డి, చీర్ల రాము, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎం సభకు తరలిన నాయకులు



అలంపూర్ నుంచి సీఎం సభకు తరలివెళ్తున్న నాయకులు

అలంపూర్: గద్వాలలో నిర్వహించిన సీఎం కేసీఆర్ బహిరంగ సభకు నియోజకవర్గం నుంచి అధికసంఖ్యలో సోమవారం తరలివెళ్లారు. ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ వీఎం అబ్రహం ఆధ్వర్యంలో ఆయా మండలాల నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ వాహనాలలో తరలివెళ్లారు.

అయిజ: ముఖ్యమంత్రి కేసీఆర్ పర్యటన సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభకు సోమవారం మండల కేంద్రంతో పాటు, పలు గ్రామాల నుంచి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు.

గట్టు: మండల కేంద్రంతో పలు గ్రామాల నుంచి సోమవారం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు గద్వాలకు తరలివెళ్లారు. జిల్లా కేంద్రాంలో నిర్వహించిన సీఎం కేసీఆర్ సభకు హాజరయ్యారు. తరలిన వారిలో ఎంపీపీ విజయ్‌కుమార్, జెడ్పీటీసీ బాసు శ్యామల, వైస్ ఎంపీపీ మేకల సుమతి, పీఏసీఎస్ చైర్మన్ వెంకటేష్, మండల అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, గట్టు సర్పంచ్ ధనలక్ష్మి ఉన్నారు.

ధరూరు: మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం పలు వాహనాల్లో సీఎం సభకు తరలివెళ్లారు. కార్యక్రమంలో ఎంపీపీ నజీమున్నీసా బేగం, వైస్ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, జెడ్పీటీసీ పద్మ, మండల అధ్యక్షులు డీఆర్ విజయ్ కుమార్, డీఆర్ శ్రీధర్, మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, జాకీర్‌లు పాల్గొన్నారు.

మానవపాడు: మండలంలోని ఆయా గ్రామాల నుంచి బీఆర్ఎస్ కార్యకర్తలు జోగుళాంబ గద్వాల జిల్లాలో నిర్వహించిన సీఎం కేసీఆర్ సభకు సోమవారం బయలుదేరి వెళ్లారు.

కేటీదొడ్డి: మండల కేంద్రం నుంచి బీఆర్ఎస్ నాయకులు సోమవారం గద్వాలలో నిర్వహించిన సీఎం కేసీఆర్ సభకు తరలివెళ్లారు.

ఉండవెల్లి: మండలంలోని అన్ని గ్రామాల నుంచి సోమవారం బీఆర్ఎస్ కార్యకర్తలు సీఎం సభకు తరలివెళ్లారు.



అయిజలో గద్వాలకు తరలివెళ్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

బాధిత కుటుంబానికి పరామర్శ

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని కొండపేట గ్రామానికి చెందిన వెంకన్నగౌడ్ అనారోగ్యంతో సోమవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎంపీపీ భర్త, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు శ్రీధర్‌రెడ్డి కొండపేట గ్రామానికి చేరుకొని మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆయన వెంట నాయకులు, కార్యకర్తలు, తదితరులు ఉన్నారు.

మందుబాబులకు అడ్డాగా పాఠశాల



అయిజ: ప్రభుత్వ పాఠశాలను మందుబాబులు మద్యం తాగేందుకు అడ్డాగా మార్చుకున్నారు. మండలంలోని పులికల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం రాత్రి మందుబాబులు మద్యం తాగి అక్కడే సీసాలు ఉంచారు. సోమవారం పాఠశాలలు పునఃప్రారంభం కావడంతో పాఠశాలకు వచ్చిన ఉపాధ్యాయులు, విద్యార్థులు మద్యం సీసాలు చూసి అవాక్కయ్యారు. పాఠశాలలో మద్యం తాగడంపై విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మద్యం తాగిన దుండగులపై అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

రెండు బైకులు ఢీః ముగ్గురికి గాయాలు

ఉండవెల్లి: మండల కేంద్రంలోని శివారులో రెండు బైకులు ఢీ కొని ముగ్గురుకి తీవ్ర గాయాలైన ఘటన సోమవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం చిన్న ఆముదాలపాడు నుంచి మానవపాడు గ్రామానికి బైక్‌పై దంపతులు సుందర్ రాజు, దేవమ్మలు కుమారుడితో కలిసి వెళ్తున్నారు. కర్నూల్ నుంచి ఇటిక్యాల మండలం ధర్మవరానికి మద్దిలేటి బైక్‌పై వెళ్తున్నాడు. మండల కేంద్రంలోని శివారుకు రాగానే రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో సుందర్ రాజు, దేవమ్మ, మద్దిలేటికి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను నేషనల్ హైవే అంబులెన్స్‌లో కర్నూలు ఆస్పత్రికి తరలించారు.

ప్రతి కార్యకర్త ప్రజాసమస్యలపై పోరాడాలి



బీజేపీ నాయకులతో జలేంధర్‌రెడ్డి

అమరచింత: బీఆర్ఎస్ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ప్రజాసమస్యల పరిష్కారం కోసం బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళనలు నిర్వహించాల్సిన అవసరం ఉందని బీజేపీ రాష్ట్ర నాయకుడు జలేంధర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని బీసీ ఫంక్షన్ హాల్‌లో సోమవారం బీజేపీ మండల ముఖ్య నాయకుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జలేంధర్‌రెడ్డి మాట్లాడుతూ ఈనెల 14న పట్టణంలో మక్తల్ నియోజక వర్గస్థాయి సీనియర్ కార్యకర్తల సమావేశం నిర్వహిస్తున్నామని, గ్రామాల నుంచి పార్టీ కార్యకర్తలు భారీగా తరలిరావాలని కోరారు. గతంలో బీజేపీ నుంచి ప్రజాప్రతినిధులుగా గెలిచి ప్రస్తుతం తటస్థంగా ఉన్న వారితో పాటు సానుభూతి పరులను సైతం సమావేశానికి తీసుకొచ్చే విధంగా ప్రణాళిక రూపొందిస్తున్నామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ నిధులను వినియోగించుకుంటూ ముఖ్యమంత్రి కేసీఆర్ తమ సొంత నిధులని ప్రచారం చేసుకోవడంపై మండిపడ్డారు. కార్యక్రమంలో మేర్వరాజు, క్యామ భాస్కర్, నరాల నారాయణ, అశోక్‌కుమార్, రాకేష్‌శెట్టి, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

నిజాయితీ చాటుకున్న 108 సిబ్బంది

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని బుర్రవాగు స్టేజీ సమీపంలో ఎన్‌హెచ్44పై బొలేరో వాహనం అదుపు తప్పి బ్రిడ్జిపై నుంచి కిందికి దూసుకెళ్లింది. స్థానికులు క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించేందుకు 108కు సమాచారం అందించారు. వెంటనే ఘటన స్థలానికి కొత్తకోట 108అంబులెన్స్ చేరుకుంది. గాయపడిన వారిని వనపర్తి జిల్లా ఆస్పత్రికి అంబులెన్స్‌లో తరలించారు. వీరేష్ అనే క్షతగాత్రుడి వద్ద, గాయపడిన మరో వ్యక్తి నుంచి రెండు సెల్‌ఫోన్లు, రూ.54,500లను ఈఎంటీ ఖాజామైనోద్దీన్, పైలేట్ చంద్రశేఖర్ గుర్తించారు. అంబులెన్స్ సిబ్బంది సెల్‌ఫోన్స్, నగదును ఆస్పత్రి డ్యూటీ డాక్టర్‌కు ఇచ్చి తమ నిజాయితీని చాటుకున్నారు. ఆపదలో ఉన్న వారిని ప్రాణాలను కాపాడటమే కాకుండా వారి వద్ద ఉన్న నగదు, సెల్‌ఫోన్స్ నిజాయితీగా అప్పగించిన అంబులెన్స్ సిబ్బందిని పలువురు అభినందించారు.



సెల్‌ఫోన్స్, నగదును డ్యూటీ డాక్టర్‌కు అప్పగిస్తున్న అంబులెన్స్ సిబ్బంది

అనుమతి లేని పాఠశాలలపై చర్యలకు డిమాండ్

వనపర్తి టౌన్: జిల్లాలో ప్రభుత్వ అనుమతి లేకుండా నడుస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ జిల్లా కన్వీనర్ జగదీశ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు అనుమతి లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని సోమవారం జిల్లా కేంద్రంలోని డీఈఓ కార్యాలయంలో ఏఈ నరహరికి ఏబీవీపీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అక్రమంగా విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్న పాఠశాల గుర్తింపు రద్దు చేయాలని, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని, సకాలంలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో హరీష్, కేదార్‌నాథ్, శివ, చింటు తదితరులు పాల్గొన్నారు.



ఏఈ నరహరికి వినతిపత్రం అందజేస్తున్న ఏబీవీపీ నాయకులు

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

వనపర్తి: రామ్కి ఫౌండేషన్ సహకారంతో పరావస్తు క్రియేటివ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగులకు ఉచిత శిక్షణ, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు సంస్థ కో ఆర్డినేటర్ గద్దె భాస్కర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 28 ఏళ్ల వయస్సు గల యువత వారి విద్యార్హతను బట్టి పది నుంచి డిగ్రీ వరకు బ్యాంకింగ్, ఎలక్ట్రానిక్స్, డిజిటల్ మార్కెటింగ్, జీడీఏ (నర్సింగ్) కోర్సుల్లో రెండు నుంచి నాలుగు నెలలపాటు హైదరాబాద్‌లోని ఒంటిమామిడి ప్రాంతంలో ఉచిత శిక్షణ ఇవ్వటంతో పాటు.. శిక్షణ పూర్తి కాగానే ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నామని, వనపర్తి ప్రాంత నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు సెల్ 95424 33427కు సంప్రదించాలని కోరారు.

ప్రతిపక్ష నాయకుల ముందస్తు అరెస్టులు



అలంపూర్‌లో పోలీసుల అదుపులో ప్రతిపక్ష, ప్రజా సంఘాల నాయకులు

అలంపూర్: జిల్లా కేంద్రంలో సీఎం కేసీఆర్ పర్యటనతోపాటు భారీ బహిరంగ సభ ఉండటంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఈ సందర్భంగా సోమవారం ప్రతిపక్ష పార్టీల నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టులు చేశారు. నియోజకవర్గంలోని కాంగ్రెస్, బీజేపీ, సీపీఎం, సీపీఐ, బీఎస్పీ పార్టీల నాయకులతోపాటు ప్రజా సంఘాల నాయకులను అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అలంపూర్ పట్టణంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అడ్డాకుల రాము, కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు, బీఎస్పీ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రేపల్లె దేవదాసు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జీకే ఈదన్న, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు నరసింహ్మా, డీవైఎఫ్‌వై నాయకుడు బండారు రఫీలను ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పోలీసుల మందుస్తు అరెస్టు చేయడంపై ప్రతిపక్ష, ప్రజా సంఘాల నాయకులు ఖండించారు.

అయిజ: ముఖ్యమంత్రి కేసీఆర్ గద్వాల పర్యటన సందర్భంగా బీజేపీ, కాంగ్రెస్, బీఎస్పీ పార్టీల నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. అరెస్ట్ అయిన వారిలో బీజేపీ నాయకులు మాదన్న, శేఖర్, గోపాలకృష్ణ, నర్సన్న గౌడ్, ఉపేంద్ర, యేసు, రాజు, వారితోపాటు కాంగ్రెస్ నాయకులు సాంబశివుడు, జయన్న, బస్వరాజు, మైనర్ బాబు, ఫిరోజ్ అదేవిధంగా బీఎస్పీ నాయకులు మధుగౌడ్, స్వామిదాస్, ఈరన్న, ప్రేమ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

ధరూరు: సీఎం గద్వాల పర్యటన నేపథ్యంలో పోలీసులు బీజేపీ నాయకులను ముందస్తుగా అరెస్టు చేశారు. అదేవిధంగా బీఎస్పీ నాయకులను అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అరెస్టు అయిన వారిలో కిష్టన్న, ప్రతాప్, ఉప సర్పంచ్ సవారన్న, వేమారెడ్డి, రామన్న, సీసల్ వెంకట్ రెడ్డిలు ఉన్నారు.

మల్దకల్: గద్వాలలో సీఎం కేసీఆర్ పర్యటనను అడ్డుకుంటారని ముందస్తుగా సోమవారం బీజేపీ మండల నాయకులను అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

మానవపాడు: జిల్లాలో ముఖ్యమంత్రి కేసీఆర్ పర్యటన నేపథ్యంలో సోమవారం కాంగ్రెస్, బీజేపీకి చెందిన నాయకులను ముందస్తుగా పోలీసులు అరెస్టు చేశారు. కాంగ్రెస్ నాయకులు జగన్‌మోహన్ నాయుడు, శేఖర్‌రెడ్డి, భీమేశ్వర్‌రెడ్డి, హుస్సేన్‌లు బీజేపీ నాయకులు గొల్ల మురళీకృష్ణ, ఈశ్వర్, లాలు, ప్రశాంత్ తదితరులను శాంతినగర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

గట్టు: సీఎం కేసీఆర్ గద్వాల పర్యటన సందర్భంగా సోమవారం బీజేపీ మండల అధ్యక్షుడు బల్గెర శివారెడ్డి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ గొర్ల రాముడు, బీజేవైఎం మండల అధ్యక్షుడు వీరశేఖర్, సీపీఎం జిల్లా నాయకుడు వీవీ నర్సింహా, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకుడు వీరేష్‌సాగర్, మల్లంపల్లి బత్తలయ్యలను పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

ఉండవెల్లి: మండలంలోని ప్రతిపక్ష నాయకులను సోమవారం పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. అరెస్ట్ అయిన వారిలో బీజేపీ, కాంగ్రెస్, బీఎస్పీ, సీపీఎం, సీఐటీయూ నాయకులు ఉన్నారు.

శాంతినగర్: సీఎం కాన్వాయ్‌ను అడ్డుకుంటారనే సమాచారంతో ఆయా పార్టీల నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టులు చేశారు. ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్‌ను హౌస్‌అరెస్ట్ చేశారు. అదేవిధంగా బీజేపీ నాయకులను అదుపులోకి తీసుకున్నారు.

కేటీదొడ్డి: సీఎం కేసీఆర్ పర్యటన పురస్కరించుకొని ప్రతిపక్ష నాయకులను పోలీసులు మందుస్తు అరెస్ట్ చేశారు. అరెస్ట్ అయిన వారిలో మండల అధ్యక్షుడు మహానంది రెడ్డి, తిమ్మారెడ్డి, హన్మంతు, పద్మ రెడ్డిలు ఉన్నారు.

ఎర్రవల్లిచౌరస్తా: జిల్లాలో ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ఇటిక్యాల మండలంలోని వివిధ పార్టీల నాయకులను పోలీసులు ఆదివారం అర్ధరాత్రి నుంచి ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఎస్ఐ గోకారి ఆధ్వర్యంలో సిబ్బంది బీజేపీ, కాంగ్రెస్, వివిధ విద్యార్థి సంఘాల నాయకులను ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. అక్రమ అరెస్టులను ఖండిస్తూ ఆయా పార్టీల నాయకులు పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు.



పోలీసుల అదుపులో వివిధ పార్టీల నాయకులు



గట్టు పోలీసుల అదుపులో ప్రతిపక్ష నాయకులు

క్లుప్తంగా

కంటి వెలుగు కేంద్రాల పరిశీలన

మల్దకల్: మండలంలోని మేకలసోంపల్లి, నాగర్‌దొడ్డి గ్రామాల్లోని కంటి వెలుగు కేంద్రాలను సోమవారం ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి పరిశీలించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని వైద్యులకు ఎంపీఓ సూచించారు. మెరుగైన వైద్యసేవలు అందించాలని కోరారు. ఆయా గ్రామాల్లో గ్రామస్తులకు కంటి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్లు నవీన్‌కుమార్, స్వరూపరాణి, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం



మానవపాడు: మండలంలోని చెన్నిపాడులో దివ్యాంగులు మద్దిలేటి, నాగన్న తదితరులు సోమవారం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. దివ్యాంగుల పింఛన్ రూ.1000 పెంచడం సంతోషకరమన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌కు రుణపడి ఉంటామని పేర్కొన్నారు.

పౌల్ట్రీ దుర్గంధంతో ఇబ్బందులు



పెబ్బేరు: మండలంలోని కంచిరావుపల్లి శివారులో ఉన్న స్నేహ పౌల్ట్రీ ఫార్మ్ నుంచి వచ్చే దుర్వాసనను నియంత్రించాలని కోరుతూ సోమవారం గ్రామస్తులు ప్రజావాణిలో వినతి పత్రం అందజేశారు. గ్రామ శివారులో నిర్మించిన స్నేహ పౌల్ట్రీ ఫార్మ్‌ల నుంచి ప్రతిరోజూ దుర్వాసన రావడంతో ప్రజలు శ్వాస తీసుకోవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అలాగే పక్కనే ఉన్న పంట పొలాలల్లో పనిచేయడానికి కూలీలు సైతం రావడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజావాణిలో కలెక్టర్ తేజస్ చందులాల్‌పవార్‌కు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో జయసుధ, మహేశ్వరి, చెన్నమ్మ, రేణుక, శేషన్నగౌడ్, భాస్కర్‌గౌడ్, గోపాల్, భీసన్న, మణెమ్మ, వెంకటేష్, శివకుమార్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

‘బీసీ బంధు’ కేటాయించాలి



పెబ్బేరు రూరల్: బీసీ బంధులో వాల్మీకి బోయలకు కూడా అవకాశం కల్పించాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాములుయాదవ్ కోరారు. సోమవారం ఆయన వాల్మీకులతో కలిసి శ్రీరంగాపురం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ ప్రసన్న కుమారికి వినతిపత్రం అందజేశారు.

కాంగ్రెస్‌లో చేరికలు



పెబ్బేరు: మండలంలోని కంచిరావుపల్లికి చెందిన బీఆర్ఎస్ నాయకులు హైదరాబాద్‌లో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి నివాసంలో సోమవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఏఐసీసీ కార్యదర్శి, క్రమశిక్షణ కమిటీ చైర్మన్ చిన్నారెడ్డి ఆధ్వర్యంలో జైపాల్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, వడ్డె రాజు, బోయ శ్రీను, రామకృష్ణతో పాటు 100 మంది కార్యకర్తలకు రేవంత్ రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో రాజేంద్రప్రసాద్ యాదవ్, ఆదిత్యరెడ్డి, రాజీవ్‌రెడ్డి, కిరణ్‌కుమార్, మొగిలి సత్యారెడ్డి, అక్కి శ్రీనివాస్‌గౌడ్, విజయవర్ధన్ రెడ్డి, వెంకట్రాములు, వెంకటేష్‌సాగర్, నరేందర్, సురేందర్‌గౌడ్, శశిధర్‌రెడ్డి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ముగిసిన వేసవి నృత్య శిక్షణ

వనపర్తి టౌన్: జిల్లా కేంద్రంలో స్వర్ణముఖి అకాడమీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేసవి నృత్య శిక్షణ ముగింపు కార్యక్రమాన్ని సోమవారం రాత్రి మున్సిపల్ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 45 మంది చిన్నారులు శిక్షణ పొందారని, 35ఏళ్లుగా పట్టణంలో స్వర్ణముఖి అకాడమీ నిర్వాహకురాలు నీరజాదేవి ఆధ్వర్యంలో శిక్షణ పొందిన వేలాదిమంది విద్యార్థులు రాష్ట్ర, దేశ, విదేశాల్లో ప్రదర్శనలు చేశారనిచారని, ఆ ఘనత నీరజాదేవికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో బీచుపల్లి యాదవ్, రఘుసురి తదితరులు పాల్గొన్నారు.